ప్రజాశక్తి
బుధవారం 7 ఫిబ్రవరి 2024 5 అనంతపురం

కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

అఖరిదానిపై 'అనంత' ఆశ..!

వైసిపి ప్రభుత్వం ఈ ఐదేళ్ల పాలనకు సంబంధించి ఆఖరి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. మంగళవారం నాడు ఇంటీరియమ్ బడ్జెట్‌ను రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రవేశపెట్టిన బడ్జెట్‌లలో ఉమ్మడి జిల్లాకు వనగూరిన లాభం ఏమీ పెద్దగా లేదు. ఇలాంటి పరిస్థితుల్లో చివరి బడ్జెట్‌లోనైనా ఉమ్మడి అనంతపురం జిల్లా వైపు ప్రభుత్వం చూస్తుందా.. లేదా.? అన్నది చూడాల్సి ఉంది.

- నేడు ఇంటీరియం బడ్జెట్
- పంటనష్ట పరిహారానికి రైతుల ఎదురుచూపు
- నేటి రాష్ట్ర బడ్జెట్‌పై ఆశలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

2019-20 నుంచి చూస్తే జిల్లాలో సాగునీటి రంగాన్ని వైసిపి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్న విమర్శలున్నాయి. హంద్రీనీవా ప్రవాహ సామర్థ్యాన్ని ఆరు వేల క్యూసెక్కులకు పెంచుతామని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తొలిసారి అనంతపురం నగరంలో జరిగిన పర్యటనలోనే హామీనిచ్చారు. ఈ మేరకు టెండర్లు కూడా పిలిచారు. పనులు మాత్రం ముందుకు కదల్లేదు. నిధుల కేటాయింపులూ జరగలేదు. అంతక మునుపు పెండింగ్‌లో ఉన్న పనులు కూడా ఈ ఐదేళ్లలో ముందుకు సాగలేదన్న విమర్శలున్నాయి. భైరవానితిప్ప ప్రాజెక్టుకు హంద్రీనీవా ద్వారా ఎత్తిపోతల పథకం ద్వారా కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లోని చెరువులన్నింటికీ నీటిని అందిస్తామని ప్రకటించారు. రాయదుర్గం సభలో ముఖ్యమంత్రి హోదాలోనే వైఎస్.జగన్మోహన్‌రెడ్డి దీనిపై హామీనిచ్చారు. ఇటీవల కళ్యాణదుర్గం వచ్చినప్పుడు రూ.84 కోట్లు భూసేకరణకు నిధులు విడుదల చేశారు. అవి కూడా ఇప్పటికీ పూర్తిగా రైతులకు అందలేదు. పేరూరు ఎత్తిపోతల పథకంలో అదనంగా రెండు రిజర్వాయర్లను ఈ కాలంలో పూర్తి చేస్తామని కూడా ప్రకటన ఉంది. ఇప్పటికీ భూసేకరణకు నిధులు కేటాయించలేదు. ఇక తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ పూర్తిగా ఆగిపోయింది. కనీసం మరమ్మత్తులకైనా రూ.30 కోట్లు ఇవ్వాలని అధికారులు చేసిన ప్రతిపాదనలు అటకెక్కాయి. ఐదేళ్లలో బడ్జెట్ కేటాయింపుల్లేక నిర్వహణ కూడా లేకుండాపోయింది. దీంతో నీరొచ్చినప్పుడల్లా ఎక్కడ గండ్లు పడుతాయోనన్న గుబులు అందరిలోనూ నెలకొంది. కనీసం ఇంటరీయమ్ బడ్జెట్‌లోనైనా వీటి ప్రస్తావన తీసుకొస్తారా.. లేదా.. అని జిల్లా వాసులు ఎదురు చూస్తున్నారు.

పరిహారం కోసం రైతుల ఎదురుచూపు

2023 సంవత్సరంలో వర్షాభావంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించింది. పంటనష్టాన్ని అంచనా వేశారు. అనంతపురం జిల్లా పరిధిలో రూ.251 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ఈ ఏడాది సంక్రాంతిలోపే ఇస్తామని ప్రకటిచారు. కానీ ఇప్పటి వరకు ప్రకటన రాలేదు. కనీసం ఈ బడ్జెట్‌లోనైనా రాష్ట్ర ప్రభుత్వం పరిహారానికి సంబంధించిన ప్రకటన ఏదైనా చేస్తుందా అని రైతులు ఎదురు చూస్తున్నారు. ఇవే కాకుండా పట్టు రైతులు, రీలర్లు ఇన్‌సెంటివ్ బకాయిల కోసం ఎదురు చూస్తున్నారు. గత నెలలో రోడ్డుపై బైఠాయించి నిరసన సైతం చేపట్టారు. గడిచిన ఐదేళ్లలో ఒక్కసారి కూడా వీరికి ఇన్సెంటీవ్ ఇవ్వలేదు. ఇవి ఇప్పుడైనా ఇవ్వాలని పట్టు రైతులు కోరుతున్నారు. వీటిపై ప్రభుత్వం ఏప్రకటన చేస్తుందోనని ఎదురు చూస్తున్నారు. ఇవే కాకుండా రహదారులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు అనేకం పెండింగులో ఉన్నాయి. వీటిల్లో ఎన్నింటికీ ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందన్నది నేటి బడ్జెట్‌లో తేలనుంది.

మాటిచ్చి..

మోసం చేయొద్దు

- సమ్మె హామీలపై జీవోలు విడుదల చేయాలి
- మరో ఆందోళనకు వెళ్లే పరిస్థితి తేవొద్దు
- ప్రభుత్వానికి మున్సిపల్ కార్మికుల హెచ్చరిక
- సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం అంగీకరించిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం మోసం చేస్తే మరో ఆందోళనకు వెళ్లాల్సిన పరిస్థితులు వస్తాయని కార్మికులు హెచ్చరించారు. సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం నాడు అనంతపురం కలెక్టర్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు ధర్నా చేపట్టారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఏటీఎం నాగరాజు అధ్యక్షతన జరిగిన ధర్నాలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.నాగేంద్ర కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మున్సిపల్ కార్మికుల సమ్మెను విరమించి నెల రోజులు కావస్తున్నా ప్రభుత్వం హామీలకు సంబంధించి జీవోలు జారీ చేయడంలో తీవ్ర అలసత్వాన్ని ప్రదర్శిస్తోందన్నారు. సమ్మె ముగింపు రోజున మూడు రోజుల్లో హామీలపై జీవోలు జారీ చేస్తామని గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్, అధికారులు హామీనిచ్చారని గుర్తు చేశారు. ఇంజినీరింగ్ విభాగంలో పని చేస్తున్న 6 వేల మంది మహిళా కార్మికులకు హెల్త్ అలవెన్స్ హామీ అమలు కాలేదన్నారు. క్లాప్ డ్రైవర్లకు చట్ట బద్ధమైన జీత భత్యాలు చెల్లింపులపై జనవరి నెలాఖరులో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేస్తామని, ఇంతవరకు వేయలేదన్నారు. ఎన్విరాన్‌మెంట్ కార్మికులకు రూ.21 వేలు, శానిటేషన్ డ్రైవర్‌లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కార్మికులకు రూ.24,500 వేతనం, విలీన గ్రామ పంచాయతీ కార్మికులను మున్సిపల్ కార్మికులుగా గుర్తించి రూ.21 వేలు వేతనం ఇవ్వాలన్నారు. ఇఎస్ఐ, పిఎఫ్ సమస్యలనూ పరిష్కరించాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.75 వేలు, దహన సంస్కారాలకు రూ.20 వేలు, ఎక్స్‌గ్రేషియా సాధారణ మృతికి రూ.2 లక్షలు, ప్రమాద మృతులకు రూ.5 నుంచి రూ. 7 లక్షలకు పెంచాలన్నారు. జిపిఎఫ్ అకౌంట్‌లు ప్రారంభించాలన్నారు. క్లీన్ ఎన్విరాన్‌మెంట్ వర్కర్స్‌కు సంబంధించి సంక్షేమ పథకాలు అమలు తదితర జీవోలు వెంటనే జారీ చేయాలన్నారు. సమ్మె కాలపు హామీల అమలుపై స్పందించకుంటే మరోమారు సమ్మెలోకి వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం డిఆర్‌ఒను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం నాయకులు మల్లికార్జున, సంజీవ రాయుడు, ఓబుళపతి, పోతులయ్య, రెగ్యులర్ ఉద్యోగుల సంఘం నాయకులు ముత్తురాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు నల్లప్ప, సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ, అంజి, వన్నూరప్ప. జగదీష్, తిరుమలేష్, రాము, సూరి, ఎర్రిస్వామి, రాజా, జుబేర్, మంత్రి వరలక్ష్మి, వన్నూరుస్వామి పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో బిల్లుల పంచాయితీ..!

దొంగ వాటికి ఒకలా.. సమస్యాత్మకమైన వాటికి మరోలా..

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంత కార్పొరేషన్‌లో బిల్లుల చెల్లింపుల్లో వింతపోకడ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. దొంగ బిల్లులకైతే ఏఈ అవసరం లేకుండానే పంపుతున్నారని.. సమస్యాత్మకమైన వాటికైతే అసిస్టెంట్ ఇంజినీర్ వద్దకు పంపుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇదే విషయంపై మంగళవారం నాడు ఇంజినీరింగ్ అధికారులు డీఈ దాక్షాయిని ఛాంబర్లో వాదులాడుకున్న పరిస్థితి కన్పించింది. జనవరి 26వ తేదీన విద్యుత్ అలంకరణకు రూ.20వేలు బిల్లు పెట్టడంపై అసిస్టెంట్ ఇంజినీర్ ఉమామహేశ్వరి అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో విద్యుత్ అలంకరణ చేసిన రమేష్ అనే కాంట్రాక్టర్‌కు రూ.3000 వంతున ఇచ్చామని ఏఈ తెలిపారు. ఆ లెక్కన బిల్లును రూ.12వేలకు సవరించి పెట్టారు. దీనిపై కాంట్రాక్టర్ షఫీ ఏఈతో వాదనకు దిగారు. వాస్తవ పరిస్థితిని వివరించేందుకు ఏఈ ప్రయత్నం చేస్తున్నా కాంట్రాక్టర్ వినకుండా గట్టిగా అరిచాడు. ఇక బిల్లుల చెల్లింపునకు సంబంధించి కార్పొరేషన్‌లో కంప్యూటర్లు లేని కారణంగా అధికారులు ఇబ్బంది పడుతున్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుధారాణికి నెలకు ఐదువేల రూపాయలు అద్దె ప్రాతిపదికన ల్యాప్‌ట్యాప్‌ను సమకూర్చారు. ఇందుకు సంబంధించి రోజూ అద్దె ప్రాతిపదికన బిల్లు పెట్టాలని డీఈ దాక్షాయిని ఆదేశించారు. ఇటీవల అసిస్టెంట్ ఇంజినీర్ కంప్యూటర్‌ను ఎన్నికల పేరుతో కలెక్టరేట్‌కు పంపారు. ఈ సమయంలో కంప్యూటర్‌లో ఎఇకి సంబంధించిన డేటా మొత్తం పాడైపోయింది. ఆ డేటాను తిరిగి పొందేందుకు ఎఇ ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. కార్పొరేషన్‌లోని ఇంజినీరింగ్, ఇతర బిభాగాల్లో నెలకొన్న ఇబ్బందుల పరిష్కారంపై ఉన్నతాధికారులు నిర్లక్ష్య ధోరణి మాని వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని పలువురు సిబ్బంది కోరుతున్నారు.

ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలి

సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్

ప్రజాశక్తి-ఉరవకొండ

పట్టణంలోని ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని సిపిఎం మండల కన్వీనర్, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టణంలో అర్హులైన పేదలు ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుంటే ఆఘమేఘాలపై వచ్చి తొలగించే అధికారులు పట్టణంలో ప్రజల సౌకర్యార్థం ఉంచిన ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకున్నా పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. రూ.కోట్లు విలువజేసే ఆస్తులు కబ్జాకు గురవుతున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులతోపాటు ఆక్రమించిన వారిపైన క్రిమినల్ కేసులు పెట్టి స్థలాలను ప్రభుత్వమే స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్

విషాదం

ఆయనకు పోలీసు ఉద్యోగం అంటే ఎంతో ఇష్టం... కుటుంబం కంటే ఎక్కువగా తన విధులకు ప్రాధాన్యత ఇచ్చే వ్యక్తి. చిన్నప్పటి నుంచి ఎక్కడా కూడా చిన్నపాటి చెడ్డపేరు లేకుండా జీవితాన్ని గడిపారు. నిజాయితీతో పోలీసు విధులను నిర్వర్తించాడు. వృత్తి ధర్మానికి ప్రాధాన్యతను ఇస్తూ క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తున్న ఆయన్ను ఎర్రచందనం స్మగ్లర్లు పొట్టనబెట్టుకున్నారు. స్మగ్లర్ల ఆటకట్టించేందుకు వెళ్లిన ఆ పోలీసు కానిస్టేబుల్ వారి బరితెంగిపుతో ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. అన్నమయ్య జిల్లా కంభంవారిపల్లె మండలం చీనెపల్లె వద్ద మంగళవారం వేకువజామున ఎర్రచందనం స్మగ్లర్ల దాడిలో మృతి చెందిన కానిస్టేబుల్ గణేష్ ధర్మవరం పట్టణం పోతుకుంట గ్రామస్తుడు. ఈయన మృతి విషయం తెలియడంతో గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

- అన్నమయ్య జిల్లాలో ఎర్రచందనం స్మగ్లర్ల ఘాతుకం
- స్మగ్లర్ల దాడిలో మృతి చెందిన కానిస్టేబుల్ ధర్మవరం వాసి
- మిన్నంటిన బంధువుల రోదనలు
- నేడు గుట్టకిందపల్లిలో అంత్యక్రియలు

మృతి చెందిన కానిస్టేబుల్ గణేష్(ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

గుట్టకిందపల్లికి చెందిన ఎపిఎస్‌పి 14వ బెటాలియన్ కానిస్టేబుల్ బి.గణేష్(40) 2013లో పోలీసు విధుల్లో చేరాడు. ప్రస్తుతం ఈయన అన్నమయ్య జిల్లా కెవి.పల్లి మండలంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కంభంవారిపల్లె మండలం చీనెపల్లె వద్ద ఎర్రచందనం అక్రమ రవాణా అవుతున్నట్లు టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి సమాచారం వచ్చింది. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం 3గంటల సమయంలో సుండుపల్లె సరిహద్దు గొల్లపల్లె వద్ద పోలీసు సిబ్బంది కాపు కాశారు. ఎర్రచందనం తరలిస్తున్న వాహనం రాగానే కానిస్టేబుల్ గణేష్‌తో పాటు సిబ్బంది దానిని ఆపేందుకు యత్నించారు. స్మగ్లర్లు కారు ఆపకుండా వేగం పెంచి తప్పించుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో వాహనాన్ని ఆపుదామని ప్రయత్నించిన గణేష్‌ను ఢీకొట్టారు. కారుతో వేగంగా ఢీకొట్టడంతో గణేష్ అక్కడికక్కడే మృతి చెందాడు.

మంచి వ్యక్తిగా గుర్తింపు..

స్మగ్లర్ల దాడిలో మృతి చెందిన కానిస్టేబుల్ గణేష్‌కు గుట్టకిందపల్లి గ్రామంలో మంచి వ్యక్తిగా గుర్తింపు ఉంది. బిల్లే శ్రీరాములు, అలివేళమ్మ దంపతులకు ఏకైక కుమారుడు. గణేశ్ కష్టపడి 2013లో పోలీసు ఉద్యోగం సాదించాడు. 6 ఏళ్ల క్రితం తండ్రి మతిచెందాడు. అప్పటి నుంచి కుటుంబానికి పెద్దదిక్కుగా ఉంటూ అన్నీ చూసుకునేవారు. 9ఏళ్ల క్రితం రామగిరి మండలం పెనుబోలు గ్రామానికి చెందిన అనూషను వివాహం చేసుకున్నాడు. ఈయనకు ఇద్దరు కుమారులు రాజకిశోర్, వేదాంత్‌లు ఉన్నారు. గ్రామంలో అందరినీ ఆప్యాయుతగా పలుకరిస్తూ, మంచి వ్యక్తిగా ఉన్న గణేశ్ స్మగర్ల చేతిలో మతిచెందడంతో గుట్టకిందపల్లిలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి.

నేడు అంత్యక్రియలు

స్మగర్లచేతిలో మతిచెందిన గణేశ్ మతదేహానికి బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు బంధువులు తెలిపారు. ఆయన మృతదేహం మంగళవారం సాయంత్రం గ్రామానికి చేరుకుంది. బుధవారం ఉదయం ధర్మవరం పట్టణం గుట్టకిందపల్లి వద్ద పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు జరగనున్నాయి.

ఆసుపత్రి వద్ద రోదిస్తున్న గణేష్ కుటుంబ సభ్యులు

పాత పెన్షన్‌ను పునరుద్ధరించే పార్టీకే మద్దతు : యుటిఎఫ్

ప్రజాశక్తి-గుంతకల్లు

పాత పెన్షన్ పునరుద్ధరణ చేస్తామని హామీ ఇచ్చిన పార్టీకే త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఉద్యోగ, ఉపాధ్యాయుల మద్దతు ఉంటుందని యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు రామప్పచౌదరి, జిల్లా కోశాధికారి రాఘవేంద్ర స్పష్టం చేశారు. మంగళవారం పట్టణంలోని భగత్‌సింగ్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఈనెల 6వతేదీ నుంచి చేపట్టనున్న 'ఓట్ ఫర్ ఒపిఎస్' గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగి జీవిత కాలం పని చేసి, పదవీ విరమణ తర్వాత భద్రత కోసం సాధించుకున్న పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, సిపిఎస్, జిపిఎస్ అంటూ పాలక ప్రభుత్వాలు ఉద్యోగి భవిష్యత్తును అంధకారంలోకి నెట్టివేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎవరైతే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని హామీ ఇస్తారో ఆ పార్టీకే ఉపాధ్యాయులు ఓటు వేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు అర్బన్ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామకృష్ణ, రాజకుమార్, రూరల్ శాఖ ప్రధాన కార్యదర్శి కల్పన, వజ్రకరూరు మండల శాఖ అధ్యక్షులు పావన మురళి, నాయకులు శంకరయ్య, యల్లన్న, రఫీ, చిన్న రంగన్న, రేవన సిద్ధయ్య, సుధాకర్, తిమ్మారెడ్డి, మారుతీప్రసాద్, వెంకటేశులు, గిరి, మాధవి, రాజ్‌కుమార్, మహబూబ్‌బాషా, రాంబాబు, రమేష్, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రంలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలోని ఎంఇఒ కార్యాలయంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో 'ఓట్ ఫర్ ఒపిఎస్' పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎంవివి రమణయ్య మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో రాజకీయ పార్టీలు పాత పెన్షన్ విధానాన్నే అమలు చేస్తామని హామీ ఇచ్చేందుకు ఒత్తిడి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ లింగానాయక్, యుటిఎఫ్ నాయకులు దేవేంద్రమ్మ, మహమ్మద్‌గౌస్, పవన్‌కుమార్, సుబ్బరాయుడు, నాగేంద్ర, నారాయణప్ప, రమేష్, జగదీష్, అనురాధ, విజయలక్ష్మి, నాగరత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విధ్వంసం తప్ప.. అభివృద్ధి శూన్యం : 'కాలవ'

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్రంలో సిఎం జగన్ అధికారంలోకి వచ్చాక విధ్వంసం తప్ప అధివృద్ధి ఎక్కడా కనిపించడం లేదని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు విమర్శించారు. మంగళవారం పట్టణంలోని 13వవార్డులో వైసిపికి చెందిన 30 కుటుంబాలు టిడిపి తీర్థం పుచ్చుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డి పాలనలో పెరిగిన నిత్యావసరాల ధరలతో పేద, మధ్యతరగతి కుటుంబాల జీవనాలు చిన్నాభిన్నం అయ్యాయన్నారు. నాలుగున్నరేళ్లలో తొమ్మిది సార్లు కరెంట్ ఛార్జీలను పెంచారన్నారు. వంటగ్యాస్ ధరలు మూడింతలు పెరిగాయన్నారు. చంద్రబాబు పాలనలో నిత్యావసరాల ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండేవని గుర్తు చేశారు. దుర్మార్గమైన జగన్ పాలనను రాష్ట్రం నుంచి తరిమి కొట్టి టిడిపి-జనసేన కూటమిని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు నాగరాజు, జనసేనా ఇన్‌ఛార్జి కరేగౌడ మంజునాథ, వార్డు ఇన్‌ఛార్జి నాగరాజునాయక్, కుమార్, ప్రహ్లాద, తమ్మన్న, మండల కన్వీనర్ హనుమంతు, వార్డు సభ్యులు ప్రశాంతి, మాజీసభ్యులు మహబూబ్‌బాషా, వెంకటేశులు, పురుషోత్తం, భారతి, తిప్పేస్వామి, శంకర్, వేణు, ఇనాయత్, వెంకటేశులు, ఎస్సీ సెల్ మల్లి, సత్తి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

నల్లితెగులు నివారణకు ప్రత్యేక చర్యలు

డిఆర్‌సి టీం హెడ్ మద్దిలేటి

ప్రజాశక్తి-ఉరవకొండ

మిరప పంటకు సోగిన నల్లితెగులు నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిఆర్‌సి హెడ్ మద్దిలేటి సూచించారు. మంగళవారం డిఆర్‌సి టీమ్ పర్యవేక్షణలో భాగంగా విడపనకల్లు మండల కేంద్రంలోని కే.తిప్పేస్వామి సాగుచేసిన మిరప పంట పొలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు అడిగిన ప్రశ్నకు సమాధానంగా నల్లి నివారణకు ఎకరాకు కాంటాక్ట్ ప్లస్ 400 మిల్లీలీటర్లు, నేటివో 160 గ్రాములు, అమిస్టార్ టాప్ 200 మిల్లీలీటర్లు చొప్పున సూచించిన మూడు మందులను వారానికి ఒకసారి మార్చి మార్చి పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పెన్నయ్య, రైతు భరోసా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నిరంతరం అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్, ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఎన్నికలపై పోలీస్, కమర్షియల్ ట్యాక్సెస్, ఎక్సైజ్, ఇన్‌కమ్ ట్యాక్స్ శాఖల అధికారులతో ముందస్తు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల నిర్బంధ నిర్వహణ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ఎన్నికల సమీపిస్తున్న వేళ జిల్లాలో సున్నితమైన ప్రాంతాల్లో అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. సరిహద్దు ప్రాంతాల్లోని చెక్ పోస్ట్ లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తర్వాత ఎంసిసి, ఎఫ్ఎస్టి, ఎస్ఎస్టి, వివిఎస్టీ, తదితర అన్ని రకాల టీమ్లు యాక్టివేట్ కావాలన్నారు. ఎన్నికలకు ముందస్తుగానే చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేయడం ద్వారా ముందస్తు అక్రమ రవాణాలను అరికట్టవచ్చన్నారు. చెక్ పోస్టులలో సీజ్ చేసిన వివరాలను ప్రతిరోజు రిపోర్టు రూపంలో అందించాలన్నారు. పోలీస్, ఇన్కమ్ ట్యాక్స్, ఎక్సైజ్ శాఖ, సెంట్రల్ గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్, కమర్షియల్ ట్యాక్స్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఎక్కడా డబ్బు, మద్యం, డ్రగ్స్, ఇతర యాంటీ సోషల్ ఐటమ్స్ అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ముందస్తుగానే అక్రమ రవాణా జరిగే అవకాశాలున్న నేపథ్యంలో నిత్యం అప్రమత్తంగా ఉంటూ అక్రమ రవాణాని అరికట్టాలన్నారు. ఈ సమావేశంలో ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్, జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, సెబ్ ఏఎస్పీ రామకృష్ణ, ఆర్డీఓలు గ్రంధి వెంకటేష్, రాణి సుస్మిత, వి.శ్రీనివాసులు రెడ్డి, ఈఆర్ఓలు రాంభూపాల్ రెడ్డి, కరుణకుమారి, వరప్రసాద్, ఎల్డిఎం సత్యరాజ్, డిసీఓ ప్రభాకర్ రెడ్డి, కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ శేషారెడ్డి, ఇన్కమ్ ట్యాక్స్ ఆఫీసర్ విజయలక్ష్మి, డిప్యూటీ కలెక్టర్ వసంత బాబు, తహశీల్దార్ శ్రీనివాసులు, ఎన్నికల సెల్ డిటి రాజా, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.గౌతమి

బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్లు

పుట్లూరు : మండల నూతన తహశీల్దార్‌గా మల్లికార్జునస్వామి మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. సాధారణ ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడ పని చేస్తున్న మోహన్‌కుమార్‌ను కర్నూలు జిల్లాకు బదిలీ చేయగా కర్నూలు జిల్లాలో విధులు నిర్వహిస్తున్న మల్లికార్జునస్వామిని ఇక్కడికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా డిటి మల్లేష్‌ప్రసాద్, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది తహశీల్దార్‌కు ఘన స్వాగతం పలికారు.



పామిడి : మండల నూతన తహశీల్దార్‌గా వి.చంద్రశేఖర్‌నాయక్ మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. పామిడిలో విధులు నిర్వహిస్తున్న సునీతాబాయిని నంద్యాల జిల్లా కొలిమిగుండ్లకు బదిలీ చేయగా కర్నూలు జిల్లా కొత్తపల్లి మండలంలో విధులు నిర్వహిస్తున్న వి.చంద్రశేఖర్‌నాయక్‌ను ఇక్కడికి నియమించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనారాయణరెడ్డి, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ క్రాంతికుమార్, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

బొమ్మనహాళ్ : నూతన తహశీల్దార్‌గా రామాంజనమ్మ మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడ పని చేస్తున్న తహశీల్దార్ శ్రీనివాసులును చిత్తూరు జిల్లాకు బదిలీ చేయగా కర్నూలు నుంచి వచ్చిన రామాంజనమ్మ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ బాలకృష్ణ, వీఆర్వోలు సుజాత, నరసింహమూర్తి, యుగంధర్, రామన్న, వన్నూరప్ప, శృతి, రవి, తిమ్మప్ప, హరిప్రసాద్, కుళ్లాయిస్వామి, సర్వేయర్ రవితేజ, రెవెన్యూ సిబ్బంది స్వాగతం పలికారు.

ఇవిఎంలపై అవగాహన కల్పిస్తున్న ఉమాదేవి

ఇవిఎంలపై అవగాహన

నార్పల : మండల కేంద్రంతోపాటు దుగుమరి, గూగూడు గ్రామాల్లో సెక్టోరియల్ ఆఫీసర్ ఉమాదేవి ఆధ్వర్యంలో మంగళవారం ఇవిఎంలపై ప్రజలకు అవగాహన కల్పించారు. త్వరలోనే సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇవిఎంలపై అవగాహన కల్పిస్తున్నట్లు సెక్టోరియల్ ఆఫీసర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రాముడు, కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ నరేంద్ర, బీఎల్‌ఒలు, తదితరులు పాల్గొన్నారు.

బిసివై పార్టీ క్యాలెండర్ ఆవిష్కరణ

పుట్లూరు : శింగనమల నియోజకవర్గ బిసివై పార్టీ అభ్యర్థి మీసాల నారాయణ స్వామి ఆధ్వర్యంలో మంగళవారం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పార్టీ అధ్యక్షులు రామచంద్రయాదవ్ ఆశయ సాధనకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్బరాయుడు, లక్ష్మీనారాయణరెడ్డి, మహేశ్వర్‌నాయుడు, కంబగిరి గంగాధర, పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

బిసివై క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

వైసిపి హయాంలో గిరిజనులకు అన్యాయం

టిడిపి ఎస్టీ సెల్ పార్లమెంట్ అధ్యక్షులు రమేష్‌నాయక్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

వైసిపి ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక గిరిజనులకు దక్కాల్సిన సంక్షేమ పథకాలను దూరం చేసి అన్యాయం చేసిందని టిడిపి ఎస్టీ సెల్ అనంతపురం పార్లమెంట్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.రమేష్ నాయక్, శంకర్ విమర్శించారు. మంగళవారం టిడిపి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ గిరిజనులకు జరిగిన అన్యాయంపై టిడిపి ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో రాబోయే 30 రోజులు గిరిజన గ్రామాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. సబ్సిడీ రుణాలు, వ్యవసాయ రాయితీలు, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వాన్ని రెడ్‌బటన్ నొక్కి ఇంటికి సాగనంపేందుకు గిరిజనులు ఏకతమౌతారని తెలిపారు. బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలకు రూ. 2 కోట్లు నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏకలవ్య జయంతి వేడుకలు ప్రభుత్వ ఖర్చులతో నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో టిడిపి ఎస్టీ సెల్ నాయకులు అనిల్, రాష్ట్ర కార్యదర్శి, రామాంజనేయులు, రాజేష్, మనోహర్, హనుమాన్ నాయక్, గంపన్న, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి ఎస్టీ సెల్ పార్లమెంట్ అధ్యక్షులు రమేష్‌నాయక్

పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలో పారిశుధ్యంపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని, వెంటనే పారిశుధ్యాన్ని మెరుగు పరచాలని పురపాలక సంఘం అధ్యక్షురాలు పొరాళు శిల్ప సూచించారు. సోమవారం స్థానిక ఛైర్‌పర్సన్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పట్టణంలో రోజురోజుకూ పారిశుధ్యం చాలా అధ్వానంగా మారుతోందన్నారు. దీంతో నగరవాసులు ఎక్కువగా ఫిర్యాదు చేస్తున్నారన్నారు. అన్నివార్డుల్లో సక్రమంగా ఇంటింటికీ చెత్త సేకరణ చేపట్టాలన్నారు. ముఖ్యంగా తడి, పొడి, ప్రమాదకర చెత్తను వేర్వేరుగా సేకరణ చేయాలని సూచించారు. మురికి కాలువలు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. అనంతరం ప్రణాళిక విభాగం కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్లానింగ్ సెక్షన్ గుమాస్తా లక్ష్మీనరసింహులు మాట్లాడుతూ పట్టణంలో ఇళ్లు కట్టుకునే వారికి ముందుగా నోటీసు ఇచ్చి గృహ నిర్మాణ వృథా పదార్థాలను కాలువలో, ఎక్కడపడితే అక్కడ వేయకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు వలిబాషా, శానిటరీ ఇన్స్‌పెక్టర్ జగదీష్, వైసిపి నాయకులు పొరాళు శివ, వార్డు ఇన్‌ఛార్జిలు శ్రీరామిరెడ్డి, గంగాధర్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాళు శిల్ప

రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ

ప్రజాశక్తి-ఉరవకొండ

పట్టణంలోని గాంధీ బజార్, లాల్‌స్వామి గుడి ప్రాంతాల వద్ద రూ.25లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. అంతేగాకుండా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ముఖ్యంగా రోడ్లు, తాగునీరు, డ్రెయినేజీలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి లలిత, ఎంపిపి నరసింహులు, జడ్పిటిసి పార్వతమ్మ, ఉప సర్పంచి వన్నప్ప, వార్డు సభ్యులు ఓబులమ్మ, పద్మావతి, శర్మస్, రేణుక, వాసుదేవుడు, నాయకులు ఈడిగ ప్రసాద్, పామిడి సలీమ్, తిప్పయ్య, బసవరాజు, సాధు కుళ్లాయిస్వామి, ఎంసి నాగభూషణం, మీనుగ ఎర్రిస్వామి, జికెఎస్ సుబ్బలక్ష్మి, ఆటో సీనా, రఫీ, బుసన్న గారి మల్లికార్జున, అంగదాల అంజి, ఓబులేసు, గాదిలింగ, బీరే శివ, శర్మస్, జోగి భీమన్న, లాలుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న విశ్వేశ్వరరెడ్డి

ప్రజల వద్దకు 'మెట్టు'

ప్రజాశక్తి-రాయదుర్గం :

'వాక్ విత్ మెట్టు' కార్యక్రమంలో భాగంగా ఎపిఐఐసి ఛైర్మన్, నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి మంగళవారం పట్టణంలోని 19వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలతో ఆత్మీయంగా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ కన్వీనర్ శివప్ప, వార్డు సభ్యులు, మంజునాథ, గోవిందరాజులు, ఫక్రుద్దీన్, షబ్బీర్, శ్రీనివాసరెడ్డి, కోఆప్షన్ సభ్యులు శ్రీనివాసులు, నజీర్, వార్డు ఇన్‌ఛార్జిలు, శివ, వైసిపి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు..

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని మలకాపురంలో వైసిపి నాయకులు మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మెట్టు విశ్వనాథరెడ్డి హాజరై జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, లబ్ధిపొందిన మహిళలకు వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మల్లికార్జున, రేకులకుంట సర్పంచి ఎర్రిస్వామిరెడ్డి, నాగిరెడ్డి, మెచ్చిరి చంద్ర, ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న మెట్టు గోవిందరెడ్డి

జూదానికి బానిసై... మహిళ హత్య..!

బీకాం విద్యార్థి ఘాతుకం-హత్యకేసును ఛేదించిన పోలీసులు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

జూదానికి బానిసై డబ్బుల కోసమే మహిళలను బీకాం చదివిన విద్యార్థి హత్య చేశాడు. నాలుగు రోజుల క్రితం మండల పరిధిలోని బి.పప్పూరు గ్రామంలో జరిగిన మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈమేరకు అనంతపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ విజయభాస్కర్‌రెడ్డి ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు...మండల పరిధిలోని పప్పూరుకు చెందిన రామానాయుడు కుమారుడు నరేంద్ర బీకాం చదివి ఇంటి వద్ద ఖాళీగా ఉండేవాడు. ఈనేపథ్యంలో జూదానికి అలవాటు పడి సుమారు రూ.5లక్షల వరకూ అప్పులు చేశారు. ఈనేపథ్యంలో ఫిబ్రవరి 1న గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణమ్మ చింతకాయల కోసం రామానాయుడు అరటి తోట పక్కన ఉన్న చింత చెట్ల వద్దకు వచ్చింది. గమనించిన నరేంద్ర ఆమె మెడలోని గొలుసును లాక్కొనేందుకు యత్నించాడు. దీంతో ఆమె ప్రతిఘటించింది. చేసేది లేక పదునైన బండరాయిని తీసుకుని లక్ష్మీనారాయణమ్మ తలపై బాదాడు. ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. దిక్కు తోచని నరేంద్ర పక్కనే అరటితోటకు తీసుకెళ్లి గుంత తీసి పాతిపెట్టాడు. చింతకాయలకు వెళ్లిన నారాయణమ్మ సాయంత్రమైనా ఇంటికి తిరిగిరాలేదు. రెండు రోజులు చూసినా ఇంటికి రాలేదు. దీంతో మృతురాలి అన్న వెంకటరమణ తన చెల్లెలు ఫిబ్రవరి 1వ తేదీ నుంచి కనిపించకుండా పోయిందని 3వతేదీన నార్పల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదేరోజే గ్రామంలోని అరటి తోటలో పూడ్చిన మహిళ శవం బయపడింది. రైతు ఇచిన సమాచారం మేరకు తోటకు వెళ్లి చూడగా లక్ష్మీనారాయణమ్మ శవంగా గుర్తించి బంధువులకు తెలియజేశారు. అయితే హత్యపై పోలీసులకు ఎలాంటి ఆధారాలు దొరకలేదు. ఈనేపథ్యంలో ఎస్పీ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ పర్యవేక్షణలో రూరల్ డీఎస్పీ వెంకట శివారెడ్డి ఆధ్వర్యంలో శింగనమల, బుక్కరాయసముద్రం సీఐలు శ్రీధర్, వెంకటేశ్వర్లు, నార్పల ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది బృందాలుగా ఏర్పడి కేసును ఛాలెంజింగ్‌గా తీసుకుని దర్యాప్తు చేపట్టారు. ఎట్టకేలకూ నిందితుడు గ్రామంలోనే ఉండగా అదుపులోకి తీసుకుని విచారించగా నిందితుడు తానే హత్య చేసినట్లు ఒప్పుకున్నాడన్నారు. మూడు రోజుల్లోనే హత్యకేసును ఛేదించడం పట్ల శింగనమల, బుక్కరాయసముద్రం సిఐలతోపాటు సిబ్బంది చలపతి, ప్రసాద్, జగదీష్, అనిల్, దేవళ్ల నాయక్, గౌస్, అమర్నాథ్, అనిల్, రామును ఎస్పీ అభినందించారు.

నిందితుడి వివరాలను వెల్లడిస్తున్న అదనపు ఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి

ప్రజ్ఞ వికాసం పరీక్షను పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్, ఎస్‌ఎఫ్ఐ నాయకులు

ప్రజ్ఞ వికాసం పరీక్షను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-ఉరవకొండ

ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 10న పదో తరగతి విద్యార్థులకు నిర్వహించనున్న ప్రజ్ఞ వికాస్ మోడల్ టెస్టు పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈమేరకు మంగళవారం పట్టణంలోని కరిబసవేశ్వర పాఠశాల వద్ద ఇందుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రామప్పచౌదరి, నాయకులు రాజశేఖర్, రఘు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిద్ధార్థ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో పబ్లిక్ పరీక్షలు అంటే భయం పోగొట్టేందుకే ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు హిరణ్య, నందు, ఎస్ఎఫ్ఐ నాయకులు సతీష్, శ్రీను, రాజు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ధర్మకర్తల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

గుత్తి : మండలంలోని తొండపాడు గ్రామంలో వెలసిన బోలికొండ రంగనాథస్వామి ఆలయ ధర్మకర్తల నియామకం కోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి వి.దేవదాసు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 20 రోజుల్లోపు దేవదాయ శాఖ ఉప కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఎంసిఎ ఫలితాలు విడుదల

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన ఎంసిఎ 3వ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ ఫలితాలు, ఎంసిఎ 3వ సెమిస్టర్, (ఆర్17), 4వ సెమిస్టర్ (ఆర్21), (ఆర్17) 5వ సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలు, ఎంబిఎ 3వ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ ఫలితాలు, ఎంబిఎ 3వ సెమిస్టర్, 4వ సెమిస్టర్, (ఆర్17) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్ బి.చంద్రమోహన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఫలితాల కోసం వెబ్‌సైట్ www.jntua.ac.inను సంప్రదించాలని తెలిపారు.

అవయవదానంపై అవగాహన

అనంతపురం : శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఎన్ఎస్ఎస్ యూనిట్-1, అఖిల భారత శరీర అవయదాన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అవయవదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షురాలు డాక్టర్ సీతామహాలక్ష్మి అవయవ దానం ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్కెయు కాప్స్ ప్రిన్సిపాల్ సోమశేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.సత్యసౌమ్య, ఎస్కెయు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మురళీధరరావు, ఎన్ఎస్ఎస్ కార్యాలయ స్టాఫ్ ఆదినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అవయదాన సంఘం అధ్యక్షురాలు డాక్టర్ సీతామహాలక్ష్మి

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

అనంతపురం : జిల్లా వ్యవసాయ శాఖ అధికారుల సంఘం డైరీ, క్యాలెండర్‌ను కలెక్టర్ గౌతమి, సంయుక్త కలెక్టర్ ఖేతన్‌గార్గ్ మంగళవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ అధికారుల సంఘం రూపొందించిన డైరీ, క్యాలెండర్లు అధికారులకు మార్గదర్శిగా ఉంటాయన్నారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారులు సంఘం అధ్యక్షులు వెంకటరాముడు, కార్యదర్శి వెంకటకుమార్, ట్రెజరర్ శ్యాంసుందర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ చిన్నమ్మ, సభ్యులు యల్లప్ప, రాకేష్‌నాయక్, సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కులగణన, ఆరోగ్య సురక్షపై సమీక్ష

బెలుగుప్ప : కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎంపిడిఒ సుబ్బరాజు పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కులగణ సర్వే, జగనన్న ఆరోగ్య సురక్ష -2, 9న మండల స్థాయిలో నిర్వహించే డీవార్మింగ్ కార్యక్రమాలపై సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి మాధవరెడ్డి, పిఆర్ ఇంజనీర్ సుధాకర్, పంచాయతీ కార్యదర్శులు రమణమూర్తి, పాండు, శమంతకమణి, మమత, అశోక్, ఉమాశంకర్, శ్రీరాములు, రవికుమార్, వెంకటేశులు, గోపాల్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి ప్రత్యేక సబ్‌జైలు తనిఖీ

గుత్తి : గుత్తి ప్రత్యేక సబ్‌జైలును జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి దీన మంగళవారం సాయంత్రం ఆకస్మిగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా జైలులోని వసతులను పరిశీలించి బాల నేరస్తులపై ఆరా తీశారు. అనంతరం ఖైదీలతో సమావేశం నిర్వహించి సమస్యలు ఏమైనా ఉన్నాయని ఖైదీలను అడిగారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక సబ్‌జైలు సూపరింటెండెంట్ వి.మహేశ్వరుడు, న్యాయవాది ఎ.సూర్యనారాయణ, ప్యారాలీగల్ వాలంటీర్ వి.నరసింహనాయుడు, టైపిస్టు ఎస్.సాదిక్ వలి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పుట్లూరు : మండల పరిధిలోని ఎల్లుట్ల, జంగారెడ్డిపేట, మడుగుపల్లి, మడ్డిపల్లి, కుమ్మనమల, రంగరాజుకుంట, చెర్లోపల్లి గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను ఎస్ఐ హేమాద్రి మంగళవారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆయా కేంద్రాల్లో విద్యుత్, వెలుతురు, తాగునీటి సౌకర్యాలపై సిబ్బందికి సలహాలు, సూచనలు అందజేశారు.

మోడల్ పేపర్ పోస్టర్లు విడుదల

రాయదుర్గం : యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ భాగస్వామ్యంతో ఈనెల 11న నిర్వహించనున్న 10వ తరగతి మోడల్ పరీక్ష పోస్టర్లను స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఎంఇఒ వెంకటరమేష్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి హనుమంతరెడ్డి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకట్రామిరెడ్డి, మురళీకృష్ణ, గుమ్మఘట్ట ప్రధాన కార్యదర్శి నాగరాజ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బంగి శివ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదల సంపూర్ణ ఆరోగ్యమే 'సురక్ష' లక్ష్యం

నార్పల : పేదలకు సంపూర్ణ ఆరోగ్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని ఎంపిడిఒ రాముడు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చామలూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ వైద్యం కోసం వచ్చిన ప్రజలకు పరీక్షలు నిర్వహించి, వారికి అవసరమైన మందులు అందజేయాలని సూచించారు. కార్పొరేటు వైద్యానికి దీటుగా పేదలకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి మల్లేశ్వరయ్య, సర్పంచి మల్లీశ్వరి, ఇఒఆర్‌డి శైలజారాణి, పప్పూరు వైద్యశాల డాక్టర్లు మహేంద్ర, హాజీరా, ఎంపిహెచ్ఇఒ మల్లికార్జున, ఎంపిహెచ్ఎస్ శ్రీరాములు, పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కుళ్లాయిస్వామి ధర్మకర్తల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

నార్పల : మండలంలోని గూగూడులో వెలసిన కుళ్లాయిస్వామి దేవస్థానం ఆలయ ధర్మకర్తల నియామకానికి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆలయ నిర్వహణ అధికారి సాకేతపురం శోభ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు 20రోజుల్లో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఫిర్యాదుల పరిష్కారంపై అవగాహన

రాయదుర్గం : ఓటర్ల జాబితాకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులు, దరఖాస్తులను పరిష్కరించే విషయమై బిఎల్‌ఒలకు మంగళవారం పట్టణంలోని రెవెన్యూ మీటింగ్ హాలులో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ చిట్టిబాబు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ వి.సుజాతదేవి, బీఎల్వోలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఉల్లిగడ్డల వామికి నిప్పు

దగ్ధమైన ఉల్లిపంట

పుట్లూరు : మండలంలోని రామలింగయ్యపల్లి గ్రామానికి చెందిన టిడిపి మండల ప్రధాన కార్యదర్శి బ్రహ్మయ్యకు చెందిన ఉల్లిగడ్డల (ఎర్రగడ్డల) వామికి గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం నిప్పు పెట్టడంతో కాలిబూడిదయ్యాయి. దీంతో దాదాపు రూ.50వేల ఆస్తి నష్టం సంభవించిందని రైతు వాపోయాడు. పట్టపగలే గుర్తు తెలియని వ్యక్తులు అగాయిత్యానికి పాల్పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి ఎర్రగడ్డల వామికి నిప్పు పెట్టిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత

అనంతపురం : శింగనమల మండలం తరిమెల గ్రామంలో సాకే రామయ్య ఇంట్లో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని అనంతపురం ప్రాంతీయ నిఘా, అమలు అధికారి మునిరామయ్య ఆదేశాల మేరకు అధికారులు మంగళవారం పట్టుకున్నారు. పక్కాగా అందిన సమాచారం మేరకు దాడి చేసి 84 సంచుల బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.2.64 ఉంటుందన్నారు. ఈమేరకు శింగనమల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో కార్యక్రమంలో అధికారులు ఎన్.రాజశేఖర్, పి.సాయిప్రసాద్, టి.రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలతో సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్లు

నార్పల : మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్యశాలలో వైద్యులు ప్రవీణ్‌కుమార్, సాదియా ఆధ్వర్యంలో వైద్యశాల పరిధిలోని ఆశా కార్యకర్తలతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు వారి ఏరియా పరిధిలోని ప్రభుత్వ ఆరోగ్య పథకాలు, ఆరోగ్య సేవలు, ఆరోగ్యశ్రీ తదితర వాటి గురించి గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే క్షయ, కుష్టు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఉన్న వారిని గుర్తించి వైద్యశాలకు తీసుకురావాలన్నారు. గర్భిణులు నెలవారి టీకాలు వేయించుకుంటున్నారా.. మందులు తీసుకుంటున్నారా అని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలన్నారు. ఈ సమావేశంలో సిహెచ్‌ఓ బాలాజీ, సూపర్‌వైజర్ ఆక్కులప్ప, ఏఎన్ఎంలు, వైద్యశాల ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవస్థానము
నేమకల్లు గ్రామము, బొమ్మనహాళు మండలం,
అనంతపురం జిల్లా.

ధర్మకర్తల మండలి నియామకము కొరకు ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా అనంతపురం జిల్లా బొమ్మనహాళు మండలం నేమకల్లు గ్రామములో యున్న శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానమునకు గాను దేవాదాయ-ధర్మాదాయ శాఖ చట్టము 30/87 మరియు సవరణ చట్టము 20,31 ఆఫ్ 2019 & 3 ఆఫ్ 2023 పరిచ్ఛేదము ప్రకారము జి.ఓ.ఎం.ఎస్.నెం.522 రెవెన్యూ (ఎండోమెంట్-I) డిపార్టుమెంట్ తేది:27/08/2021 ప్రకారము శ్రీయుత ఉపకమీషనరు, దేవాదాయ శాఖ, కర్నూలు వారి Notice in ENDOW-ADMNOMISC/68/2024-JA(B3)-ENDTS KNL/DATED:02/02/2024 యందు ప్రచురించిన తేది నుండి 20 రోజుల అనంతరము ధార్మిక పరిషత్ వారు ధర్మకర్తల మండలి నియామకము చేసేదరు.

కావున ఆసక్తిగల అభ్యర్థులు ధర్మకర్తల నియామకము కొరకు ఈ నోటీసు ప్రచురించి 20 రోజులలోపు దేవాదాయశాఖ చట్టము 17 (3) నందు గల నిబంధనలలో పేర్కొనబడిన నమూన ఫారం-II ద్వారా శ్రీయుత ఉప కమీషనరు, దేవాదాయ శాఖ కర్నూలు వారికి ధరఖాస్తులు పంపవలెను.

సం/-పి.గురుప్రసాద్, ఉప కమీషనరు (ఎఫ్.ఎ.సి)
దేవాదాయ ధర్మదాయ శాఖ, కర్నూలు

'సిద్ధం' సభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-అనంతపురం

ఈనెల 10న రాప్తాడు వద్ద నిర్వహించనున్న సిద్ధం మహాసభకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం జిల్లాకేంద్రంలోని వైసిపి జిల్లా కార్యలయంలో వైసిపి నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి అధ్యక్షులు పైలా నరసింహయ్య, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిసిసిబి ఛైర్‌పర్సన్ లిఖిత, మాజీ ఛైర్మన్ బోయ వీరాంజనేయులు, నాయకులు మీసాల రంగన్న, హరీష్‌యాదవ్, నదీమ్ అహ్మద్, బి.ఎర్రిస్వామిరెడ్డి, వెన్నపూస రవీంద్రారెడ్డి, అహుడా ఛైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, రాళ్ల తిమ్మారెడ్డి, చిట్రా వెంకటేష్, కాపు మాధవరెడ్డి, నాగ శేషానందరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఎల్ఎం.మోహన్‌రెడ్డి, ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : 'సిద్ధం' సభను విజయవంతం చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఉరవకొండ బైపాస్ రోడ్డు పక్కన ఉన్న దేవాంగ కల్యాణ మండపంలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి ప్రజలు వేలాదిగా తరలివచ్చి చరిత్ర సృష్టించాలన్నారు. ఈ సమావేశంలో ఐదు మండలాల ప్రజాప్రతినిధులు, వైసిపి నేతలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పి : ఈనెల 11న నిర్వహించే సిద్ధం సభను విజయవంతం చేయాలని ఎంపీ, కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని వైఎస్‌ఆర్ రైతు భరోసా కేంద్రంలో మండల కన్వీనర్ సత్యనారాయణ శాస్త్రి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్ధం సభకు సిఎం జగన్ హాజరవుతారన్నారు. కావున మండలం నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మారుతీశ్వరి రామమూర్తి, జడ్పీటీసీ రాధాస్వామి, కమలా నాగరాజు, వైస్ ఎంపిపిలు భీమిరెడ్డి శ్రీ లక్ష్మీ అజయ్‌బాబు, కో ఆప్షన్ నెంబర్ ముజీవుల్లా, మండల సచివాలయ కన్వీనర్ ఇ.రాము, సీనియర్ నాయకులు సుదర్శన్‌రెడ్డి, ఎంపిటిసి గంగమ్మ, హనుమంతురాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం సిద్ధం సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

సేవాలాల్ జయంతి ఉత్సవాలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-గుత్తి

బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి మహోత్సవాలకు సంబంధించి ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి రామాంజనేయులు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని చెర్లోపల్లి గ్రామ సమీపంలో ఉన్న సేవాఘడ్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13, 14, 15వ తేదీల్లో జరిగే సేవాలాల్ జయంతి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంత్ శ్రీ సేవాలాల్ ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు జగన్నాథరావు, ఉపాధ్యక్షులు కేశవనాయక్, ప్రధాన కార్యదర్శి రవీంద్రనాయక్, టిటిడి బోర్డు సభ్యుడు అశ్వర్థనాయక్, అధికారులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి ఏర్పాట్లపై చర్చిస్తున్న గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి రామాంజనేయులు